# మనోదృశ్యం

"చిరంజీవి మధుబాబూ,

ఆశీర్వచనాలు. కులాసాగా వున్నావని తలుస్తాను. అమ్మపోయిందని తెలిసింది. కన్నతల్లి కళ్ళముందు లేదు అనుకోవటం ఏ జీవికైనా భరించలేని బాధే. పాతిక సంవత్సరాల అనుబంధాన్ని, ఆత్మీయతను, అనురాగాన్ని పోగొట్టుకున్నామనుకోవటం చాలా కష్టమైన పనే అయినా తప్పదు. దేవుడి నిర్ణయాన్ని కాదనే శక్తి మనకెక్కడిది.

జాగ్రత్త సుమా.

ఉంటాను.

నీ శ్రేయోభిలాషి."

వెనక్కు ముందుకు తిప్పిచూచాడు మధు ఆ ఇన్‌లాండ్ లెటర్‌ను. ఎవరు రాశారో తెలియటం లేదు. చిరునామా లేదు. ఏ ఊళ్ళో పోస్టయిందో చూద్దామన్నా కొట్టిన ముద్ర ముద్దముద్దగా వుండి తెలియకుండా వున్నది.

చాలా విచిత్రంగా అనిపించింది ఆ లేఖ చూస్తుంటే అతడికి.

అంత రహస్యంగా వుండిపోవల్సిన తన ఆ శ్రేయోభిలాషులెవరో ఎంత ఆలోచించినా అర్థం కావటంలేదు.

సరిగ్గా ఈ ఉత్తరం వచ్చి రెండు నెలలయింది.

పనివాడు ఆటో తేవటానికి వెళ్ళాడు. చేతి సంచీలో అవసరానికి వుంటయి అన్నట్లుగా ఓ జత గుడ్డలు పెట్టుకొని భుజానికి తగిలించుకున్నాడు. గోడనున్న సాయిబాబా ఫొటోను చూస్తూ దణ్ణం పెట్టుకున్నాడు.

మొదటి ఉత్తరం వచ్చిన సరిగ్గా వారం రోజులకు మరో ఉత్తరం...

"మధుబాబూ,

అమ్మ చేతి వంట తినక అప్పుడే నెలయింది కదూ. ఇప్పటికైనా నువ్వు వెంటనే ఒక నిర్ణయం తీసుకొని నిర్మలను వివాహం చేసుకోరాదూ... అవునుగదూ... ఇప్పుడు ఏడూరి సూతకం... మామయ్యకు అదే చెప్పు... నీ పెళ్ళయిందాకా నువ్వు మామయ్య గారింట్లోనన్నా వుండు, లేదా అత్తయ్యను వచ్చి నీ దగ్గర వుండమను. నువ్వు హోటల్ భోజనం చేసి మాత్రం ఆరోగ్యం పాడు చేసుకోబోకు.

మీ అమ్మ మాటకు నువ్వెంత గౌరవమిస్తావో నాకు తెలుసు. నా మాటకూ అంత విలువ ఇస్తే నేను ఎంతగానో సంతోషిస్తాను.

నీ శ్రేయస్సునే నేను సదా కాంక్షిస్తుంటాను. ఉంటాను మరి.

– నీ శ్రేయోభిలాషి."

వడివడిగా ఆ ఉత్తరాన్ని అన్ని వైపులా తిప్పాడు మధుబాబు. ఎవరు రాసిందీ తెలియదు. ఇదీ ఇన్‌లాండ్ లెటరే... ఏ ఊర్లో పోస్టయిందీ గూడా తెలియటంలేదు.

వాకిట్లో ఆటో ఆగిన చప్పుడు అయింది. చివరి సారిగా ఓ గ్లాసుడు మంచినీళ్ళు త్రాగి బయిటకు వచ్చి తలుపు మూసి తాళం వేశాడు.

అప్పుడు ఉదయం ఏడుగంటలయింది. సూర్యుడు పైపైకి పోతున్నా డిశెంబరు చల్లదనం ఆయన విరజిమ్ముతున్న వేడినంతా హరించి వేస్తోంది.

మొట్టమొదటిసారిగా మామయ్య మీద అనుమానం వచ్చింది. తాను నిర్మలను వివాహం చేసుకోవటానికి తన అంగీకారాన్ని చెప్పకుండా నాన్చుతున్నాడు. కారణమేమీలేదు. తనకు కాబోయే భార్య కనీసం గ్రాడ్యుయేషన్ అన్నా పూర్తి చేయాలి అనేది తన కోరిక. ఈరోజుల్లో చదువులేకుండా చదువుకున్న వాళ్ళ మధ్య మెలగటం చిన్నతనంగా ఉంటుంది. అంతేకాదు. రేపు పుట్టబోయే పిల్లలకు చదువు విషయంలోనైనా కాస్త చేదోడు వాదోడుగా వుంటుందనేది ఆశ. ఆవిడగారు ఉద్యోగాలు చేసి తనకేం సంపాదించి పెట్టనక్కరలేదు. నిర్మలకయితే అందమున్నది గాని చదువు మీద ఎలాంటి ఇష్టతా లేదు. ఎంతసేపూ షోకులూ, అలంకరణలూ... కాకపోతే ఏ సినిమా చూద్దామా, ఏ టీవీ సీరియల్లో లీనమై పోదామా అనేదే యావ!

ఐదు సంవత్సరాలబట్టీ ఆ డిగ్రీ కోసం కుస్తీ పడుతోంది!

తను ఈ మెలికన్నా పెడితే అది గ్రాడ్యుయేట్ అవుతుందని, తనకు గౌరవ ప్రదంగా ఉంటుందనేది తన ఆలోచన!... ఆ కారణంతోనే తను అటూ ఇటూ తేల్చకుండా 'చదువు, చదువు' అని నసుగుతున్నాడు!

అందుకుగాను తన మామయ్య తన మీద ఇలాంటి ఒత్తిడి తేవటానికి ప్రయత్నించటంలేదు గదా! అలా చేసినా చేసేటంత ఘనుడే... అప్పుడప్పుడూ కాస్త అతి తెలివి ప్రదర్శిస్తుంటాడు!

– కానీ మామయ్య చేతి వ్రాత తనకు తెలుసు. ఆయన దస్తూరి కాదిది... ఎవరితోనైనా వ్రాయించాడేమో ఆలోచించాలి... అలా అలోచిస్తుండగానే మరో ఉత్తరం వచ్చింది!

"మధుబాబూ,

నీ పన్నెండో ఏట అనుకుంటాను... ఒక కోయదొర వచ్చి నిన్ను చూస్తూనే నీకు యిరవై అయిదో ఏట రాజయోగం ప్రారంభం అవుతుందని చెప్పాడు."

చటుక్కున తలెత్తాడు మధుబాబు. నిజమే. అమ్మ తనకు ఎప్పుడూ చెప్పి ఎంతో మురిసిపోతుండేది. రాజయోగ మంటే – తనకు కాస్త ఊహ తెలిసేటంత వరకూ– ఆమె ఆమాట అన్నప్పుడల్లా– ఏఁవిటమ్మా అంటూ అడుగుతుండే వాడు. 'ఏఁవీ లేదు... నువ్వు కాలు క్రింద పెట్టకుండా అన్ని భోగాలు రాజాలా అనుభవిస్తావన్న మాట!' అంటూ మురిపెంగా తన్నే చూస్తూ నవ్వేది.

"మీ అమ్మ ఆ మాట చెప్పి మురిసి పోతున్నప్పుడల్లా– నేను హెచ్చరిస్తుండే దాన్ని 'దిష్టి తగులుతుంది ఎవ్వరితో అనబోకు' అని"

తనకు గుర్తే అమ్మ చీటికి మాటికి ఇంత ఉప్పుతెచ్చి తన తల చుట్టూ అటూ యిటూ తిప్పి 'ధూ ధూ' అంటూ దొడ్లో పారేసి వచ్చేది.

అమ్మ చేష్టకు తను పకపకా నవ్వుతుండేవాడు.

సరిగ్గా వారానికి మరో ఉత్తరం!...

"అమ్మ ఎప్పుడూ అంటుండేది– మధుకు ఒక తమ్ముడో, చెల్లెలో ఉంటే ఎంతబాగుండేదో అని... కానీ దేఁవుడు ఇవ్వనప్పుడు ఉన్నదానితోనే తృప్తి పడాలి. అందుకే నీలోనే మరో మగపిల్లవాడిని, మరో ఆడపిల్లని చూచుకుంటూ

ఆనందిస్తుండేది. గుర్తుందా... నీకు అయిదో ఏడు వచ్చి స్కూలుకు పంపేటంతవరకూ- మీ అమ్మ నీకు తల దువ్వి, జడవేసి పూలు పెట్టి ముద్దుల వర్షం నీ మోము మీద కురిపించేది. అందుకే- నువ్వు వివాహం చేసుకొని పదిమంది పిల్లలతో ఇల్లు కళకళలాడేలా చేస్తే మీ అమ్మ ఆత్మ ఎంతగా సంతోషిస్తుందో?

రెండు సంవత్సరాల క్రితం నాన్న పోవటం ఒక దెబ్బయితే, ఇప్పుడు అమ్మ- ఏం చేస్తాం... భగవదేచ్ఛ- తప్పదు మరి.

ఉంటాను.

సదా నీ ఆనందమే నా ఆనందంగా భావించే,

నీ శ్రేయోభిలాషి."

నాన్న గుర్తుకు వచ్చాడు. ఆయన ఆప్యాయత గుర్తుకు వచ్చింది. తన కోరిక నాలిక మీద ఉండగానే తీర్చే ఆయన ఆత్రుత గుర్తుకు వచ్చింది. అమ్మ అంటుండేది- వాడు గనుక చెడిపోతే బాధ్యులు మీరే అని- ఆయన పకపకా నవ్వేసేవాడు. 'మధుబాబు చెడడు. వాడు ఎవరి పెంపకంలో ఉన్నాడో గుర్తుంచుకో' ఆ మాట వింటూనే ఆమె మురిపెంగా తనని పొదవిపట్టుకొని నవ్వేది!

ఉత్తరాన్ని అటూ యిటూ పట్టుకు తిప్పాడు. ఈసారి స్టాంపు మీద పడిన ముద్రలో కొన్ని అక్షరాలు అస్పష్టంగా కనబడుతున్నయి- అది మంగుళూర్‌లో పోస్టు చేసిన ఉత్తరంలా ఉన్నది!

మంగుళూర్ అనుకుండేటప్పటికల్లా తనింట్లో అద్దెకుండి వెళ్ళిన ప్రహ్లాదరావుగారు గుర్తుకు వచ్చారు. వాళ్ళ పెద్దల్లుడు ఇప్పుడు ఉద్యోగరీత్యా అక్కడే వున్నాడు. రెండు సంవత్సరాల క్రితం ఈయనా రిటయిరవ్వటంతో అక్కడికే జేరారని ఆ మధ్య మాటల్లో అత్తయ్య అన్నది.

వాళ్ళు తనింట్లో పదేళ్ళకు పైగా అద్దెకు ఉన్నారు. ఆయన్ను మామయ్య అని, ఆయన భార్య రుక్మిణమ్మగారిని అత్తయ్యా అని తను పిలుస్తుండేవాడు. వాళ్ళకు ముగ్గురూ ఆడపిల్లలే అవ్వటంతో తనని ఎంతో ఆప్యాయంగా ఆమె ఎప్పుడూ దగ్గరకు తీసుకుంటుండేది. ఇంట్లో చేసిన ప్రతిదీ కూతుళ్ళతో సమానంగా తనకూ పెడుతుండేది.

అమ్మ ఎప్పుడూ అంటుండేది. ఒక మగపిల్లవాడుంటే ఆ దంపతులు ఎంతగా సంతోషించే వాళ్ళోనని!

నాలుగేళ్ళ క్రితం ఆయన ఈ ఊరినుంచి ట్రాన్స్‌ఫర్ అయి వెళుతున్నప్పుడు ఆమె తనను విడిచి వెళ్ళటానికి ఎంతో వేదన చెందింది. ఆ రోజంతా తనని వదిలిపెట్టనేలేదు. "మధుబాబు...మధుబాబు..." అంటూ ప్రతిదానికీ ఏదో కారణంతో పిలుస్తూనే వున్నది. వెళ్ళే రోజున తనకు ప్యాంటు, షర్టు రెడీమేడ్‌లో అంకుల్ చేత తెప్పించింది. తనకు ఆనాటి దృశ్యం– కళ్ళముందు కదలసాగింది– ఆమె చివరకు ఆటో ఎక్కుతూ, "మధుబాబూ! మమ్మల్ని మరిచిపోవు గదూ!" అని తన చేతులు పట్టుకు ఊపుతుంటే ఆమె కళ్ళల్లో తడి తనకు స్పష్టంగా కనబడింది.

ఆమెకు తనమీద ఎంతో ప్రేమ ఉన్నమాట నిజమేకాని– తనింటినుంచి వెళ్ళిన తరువాత ఇంతవరకూ ఉత్తరం రాయనివాళ్ళు– వెళ్ళిన కొత్తల్లో ఒకటి రెండు రాశారేమో తనకు గుర్తులేదు– ఇప్పుడు శ్రేయోభిలాషినంటూ ఉత్తరాలు వ్రాయవలసిన అవసరం ఏమున్నది? అంత వ్రాయాలనుకుంటే తమ పేరు మీదే వ్రాయవచ్చుగదా!

అర్థం కావటంలేదు మధుబాబుకు.

తనకు తెలిసినంతవరకూ వాళ్ళు తప్ప మంగుళూర్‌లో తమ విషయాలు అంతగా తెలిసిన వాళ్ళు మరెవ్వరూ లేరు!

ప్రహ్లాదరావుగారి చెల్లెలు ఇల్లు తనకు తెలుసు. ఐదారు సంవత్సరాల క్రితం పిచ్చికలగుంట అవతల బృందావన్ గార్డెన్స్‌లో ఇల్లు కట్టుకున్నప్పుడు గృహప్రవేశానికి అమ్మా నాన్నతో తనూ వెళ్ళాడు.

ఆటో బస్టాండులో ఆగుతుండగా ఉలిక్కిపడ్డట్లుగా ఆలోచనలు తెగిపోయినయి.

నీరసంగా బయిటకు వెళుతున్న ఎర్ర బస్సుల వంక చూస్తూ నిలబడిపోయాడు మధుబాబు. భుజానికి వ్రేలాడుతున్న ఓ జత గుడ్డలున్న సంచీ గూడా ఆ క్షణాన చాలా బరువుగా వున్నట్లనిపించింది. సంచీని ఎడమ భుజం మీదనుండి కుడివైపుకు మార్చుకున్నాడు.

తను చాలా రోజులయింది ఇటు పక్కకు వచ్చి. అమ్మ పోయినప్పుడు అస్థికల నిమజ్జనానికి అమరావతి వెళ్ళాడు గాని– అప్పుడు తాలూకాఫీసు ముందు బస్సెక్కాడు. బస్టాండుకు రావాల్సిన అవసరం పడలేదు.

అటూ యిటూ చూస్తూ తనకు కావాల్సిన బస్సు ఏ ప్లాట్‌ఫాం మీద ఆగుతుందో అనుకుంటూ నడుస్తున్నాడు.

– ఆరోజు తను ప్రహ్లాదరావుగారి చెల్లెలు ఇంటికి వెళ్ళేటప్పటికి ఆమె వరండాలోనే కూర్చొని కనబడింది. తనను చూస్తూనే లేచి ఆహ్వానసూచకంగా నవ్వింది.

"అంకుల్ వాళ్ళు మంగుళూర్‌లో వుంటున్నారట గదా... వాళ్ళ ఫోను నంబరు కావాలి... చాలా రోజులయింది ఆంటీతో మాట్లాడి!" అన్నాడు గడప మీద కాలు పెడుతూనే.

"ఈ మధ్య ఫోను చేస్తే చెప్పాను, మీ అమ్మగారు పోయిన సంగతి... చాలా బాధపడ్డది... ఉత్తరం వ్రాస్తానన్నదే!"

తడబడ్డాడు మధుబాబు. "లేదు... రాయలేదు!" అన్నాడు గొణుగుతున్నట్లుగా. "ఆంటీకి నేనంటే ఎంతో అభిమానం!"

"మా వదినకు మగపిల్లలంటే తగని ప్రేమ... ఆమెకు లేరు గదా మరి!"

తరువాత పావుగంటకు ఆమె ఇచ్చిన కాఫీ త్రాగి, ఫోను నంబరు తీసుకొని బయిటకు వచ్చాడు 'రాత్రికి ఈ రహస్యానికి తెరదీయాలి!' అనుకుంటూ.

– కాని ఎంత ఆలోచించినా పేరు లేకుండా శ్రేయోభిలాషినంటూ ఉత్తరం వ్రాయాల్సిన అవసరం వాళ్ళకు ఎందుకు కలిగిందో అర్థం కావటంలేదు. పోస్టల్ స్టాంపు చూస్తుంటే అది మంగుళూర్‌నుంచే వచ్చినట్లుగా వున్నది. ఆపైన అంకుల్ చెల్లెలు చెప్పినట్లుగా అమ్మ పోయిన సంగతీ వాళ్ళకు తెలుసు– ఆంటీ ఉత్తరం రాస్తానని గూడా అన్నదట!

అసహనంగా నడుస్తున్నాడు మధుబాబు. అలాంటి ఉత్తరాలు రాస్తూ తనను అయోమయంలో పడేసి మనస్తాపం కలిగించటంలో ఆంటీ ఉద్దేశ్యమేమిటో తెలుసుకోవాలి!... ఇదేదో సరదాగా చేస్తున్న పని మాత్రం కాదు!

రాత్రి ఎనిమిదిన్నర అవుతుండగా ఫోను అందుకొని మంగుళూర్ నంబరుకు తిప్పాడు. మధుబాబు చేతి వేళ్లు తడబడుతున్నయి... తను కఠినంగానే మట్లాడాలి!

ఫోను అవతలపక్కన రింగు అవుతున్న శబ్దం.

ఎత్తింది ఆంటీనే!

"నేను మధుబాబుని ...గుంటూరు నుంచి మాట్లాడుతున్నాను... ఆంటీనా మాట్లాడుతున్నది... గుర్తు పట్టారా ఆంటీ... బ్రాడీపేటలో మా యింట్లో చాలా కాలం మీరు అద్దెకున్నారు... శారదాంబగారి అబ్బాయిని!"

"మధుబాబూ... నువ్వా!..." చాలా ఉద్రేకంగా ఉన్నదా కంఠం. "ఈ మధ్యనే మా ఆడబడుచు చెప్పింది... అమ్మ పోయిందిట గదా! చాలా బాధ వేసిందయ్యా... అప్పటినుంచీ నీకు ఫోను చేద్దామనే అనుకుంటున్నాను... ఇదుగో... మేం మంగుళూర్ వచ్చేటప్పుడు సామాన్లు సర్దటంలో టెలిఫోను నంబర్ల పుస్తకం ఎక్కడ పెట్టామో కనబడటంలేదు... ఒక్కడివే వుంటున్నావా ఇంట్లో... హోటల్ భోజనమేనా... పోనీ పెళ్ళయిందాకా అత్తయ్య వాళ్ళింటో ఉండటమో, లేకపోతే వాళ్ళనే వచ్చి నీ దగ్గర ఉండమనటమో చేయాల్సింది... ఎట్లాగయినా రేపు పెళ్ళి చేసుకుండేది వాళ్ళమ్మాయి నిర్మలనే గదా... మా ఆడబడుచు చెప్పిందిలే ఇంకా నీ పెళ్ళి కాలేదని... ఇప్పుడెట్లాగో చేసుకోవటానికి వీల్లేదు... ఏడూరి సూతకమాయె!"

మధుబాబు మాట్లాడలేక పోతున్నాడు. అతడి దవడలు బిగుసుకు పోతున్నయి– ఆ ఉత్తరాల్లో వ్రాసిందే ఆమె చెబుతున్నది!

ఇన్ని తెలిసిన ఆమె శ్రేయోభిలాషి అవతారం ఎందుకు ఎత్తవలసి వచ్చిందో?

"మీ అమ్మ చెబుతుండేది గదూ ఎప్పుడూ... నీకు పెళ్ళీడు వచ్చేటప్పటికి మహారాజ యోగముందని... నిర్మల మీ ఇంట్లో కాలు పెట్టటమంటే నువ్వు స్వర్గంలో కాలు పెట్టినట్లే... నీకు నిర్మల ఉన్నది గాబట్టి నేను నిన్ను వదిలేశాను గాని... లేకపోతేనా మా యింటికి అల్లుణ్ణిగా తెచ్చుకుండేదాన్ని ఈపాటికి!"

ఆమె గలగలా పరుగెడుతున్న గోదావరిలా మాట్లాడేస్తోంది... అంటే తను అల్లుడు కాలేక పోయినందుకు ఈర్ష్యతో ఈలాంటి వెధవ పనులు చేస్తున్నదా?

ఇందులో ఏదో నిగూఢత వున్నది!... తెలుసుకోవాలి...

కోపంతా అతడి చేతివేళ్ళు ఫోన్ రిసీవర్ చుట్టూ బిగుసుకు పోతున్నయి.

"నేను ఒక్కటి అడుగుతాను చెప్పండి ఆంటీ!" విసురుగా అన్నాడు మధుబాబు ఆమె మాటల్ని త్రుంచేస్తున్నట్లుగా.

ఆమె అదేమీ పట్టించుకోనట్లుగానే, "ఇక్కడయితే అంతా కులాసానయ్యా... రెండోది పెళ్ళి చేసుకొని అమెరికా చెక్కేసింది... మీ మామయ్యగారు రిటయిరవుతుండగానే మా పెద్దల్లుడు వచ్చి మమ్మల్ని ఇక్కడకు తీసుకు వచ్చాడు... చివరిది ఇంజనీరింగ్ ఫైనలియర్లో వున్నది... బెంగుళూరులో హాస్టల్లో ఉండి చదువుకుంటున్నది... మామయ్య గారు చేతిలో పనిలేక కాలు గాలిన పిల్లిలా ఇంట్లోకి వాకిట్లోకి తిరుగుతుంటారు... ఇప్పుడే ఇక్కడకు దగ్గరలో వున్న సుబ్రహ్మణ్యస్వామి గుళ్ళో ఏవో ప్రత్యేక పూజలున్నయ్యంటే అరగంట క్రితం వెళ్ళారు... ఆయన వుంటే ఆయనతో గూడా మాట్లాడేవాడివి..." చెప్పుకు పోతున్నది.

"ఆంటీ!..." అసహనంగా అరిచాడు మధుబాబు ఆమె మాటలకు చికాకు పడుతూ.

అవతల క్షణంలో నిశ్శబ్ద మేర్పడింది అతడి కంఠానికి సమాధానం అన్నట్లుగా.

"...నేను చెప్పేది కాస్త వింటారా?" అన్నాడు విసురుగా.

ఆమె నీరసపడి పోయినట్లుగా, "చెప్పు!" అన్నది రెండు క్షణాల మౌనం తరువాత.

"ఎందుకు మీరు శ్రేయోభిలాషినంటూ పిచ్చిపిచ్చి ఉత్తరాలు వ్రాస్తున్నారు నాకు?... నా నుండి ఏమి ఆశించి అలాంటి ఉత్తరాలు రాసి నాకు మనస్తాపం కలిగిస్తున్నారు... రాయదలుచుకున్నదేదో ధైర్యంగా, స్పష్టంగా రాయవచ్చు గదా... ఈ డొంక తిరుగుడంతా దేనికి? అసలు దేని కోసం రాస్తున్నారు ఆ ఉత్తరాలన్నీ... నా క్షేమం కాంక్షించేనా?" ఆ కంఠంలో కోపమేగాదు, బాధ, వేదనా గూడా వున్నది.

"మధుబాబూ! నువ్వేం అంటున్నావో నాకేం అర్థం కావటంలేదు!" ఎంతో హుషారుగా మాట్లాడుతన్న ఆమె కాస్తా క్షణంలో నీరసంలోకి జారిపోయింది.

"నాకు మంగుళూర్ నుంచి- నీ శ్రేయోభిలాషినంటూ రకరకాల ఉత్తరాలు వస్తున్నాయి... అక్కడ మీరు తప్ప నాకు తెలిసినవాళ్ళు మరెవ్వరూ లేరు!" కఠినంగా అన్నాడు. "ఇక నుంచైనా మీరు రాయటం ఆపుజేస్తే నాకు మనశ్శాంతి లభిస్తుంది! నాకు ఎంతో మేలు చేసినవాళ్ళవుతారు!"

కొద్దిక్షణాల భారమైన నిశ్శబ్దం తరువాత, "నువ్వు పొరబాటు పడుతున్నావు మధుబాబూ! అలాంటి ఉత్తరాలు వ్రాయవల్సిన అవసరం మాకు లేదు... అసలు మీ ఇల్లు వదిలి వచ్చిన తరువాత నీతో మాట్లాడటం ఇదే ప్రథమం... నువ్వెందుకో పొరబడుతున్నావ్... నీ నంబరు చెప్పు... మామయ్యగారు రాంగానే ఫోను చేయిస్తాను!"

అన్నది చాలా లోగొంతుకతో, అతడి మాటలకు డీలాపడిపోయి నీరసంగా. "ఎక్కడో, ఏదో పొరబాటు జరిగినట్లున్నది... మా మీద అనవసరంగా ఆపోహ పడుతున్నావు... అసలు అలా రాయవలసిన అవసరం మాకేమిటి!"

"నేనూ అదే అడుగుతున్నాను!" విసురుగా అనేసి ఫోను రిసీవర్‌ను ఠక్కున క్రెడిల్ చేసేశాడు.

తరువాత కళ్లుమూసుకొని మంచం మీద పడుకుంటే- తను గాని తొందరపడలేదు గదా అనే అనుమానం రాగా కొన్ని క్షణాలు తత్తరపడ్డాడు. అనవసరంగా వారి మీద నింద వేశాడా? కవరు తీసి మరో సారి చూచాడు... ఆ అక్షరాలు అంతగా స్పష్టంగా లేకపోయినా మంగుళూర్ లాగానే వున్నయి!

వాళ్ళు కాకపోతే మరెవ్వరు రాస్తారు? అందునా తన కుటుంబ విషయాలు, చిన్ననాటి విషయాలు వాళ్ళకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియవు!... గూడలెగరేశాడు చిరాగ్గా... ఛఛ! వెధవ గొడవ...

రెండు రోజులు ఆలాంటి ఆలోచనలతో మధనపడుతుండగానే... మరో ఉత్తరం వచ్చింది!

ఈసారి ఆకవరు మీద ముద్ర చాలా స్పష్టంగా ఉన్నది- అది మంగళగిరినుంచి!

అది చూస్తూనే ఎంతగానో కలవరపడ్డాడు మధుబాబు. త్వరత్వరగా క్రితం సారి వచ్చిన ఉత్తరం తీసి పోస్టలు ముద్రలను పోల్చి చూశాడు. మొదటిది స్పష్టంగా లేకపోయినా రెండూ ఒకచోట నుండే వచ్చినట్లుగా అర్థమయింది... అవును- అవి మంగళగిరినుండే వచ్చినయి!

ఛ! తను అనవసరంగా ఆంటీ వాళ్ళమీద అనుమానపడి తొందరపాటుతో ఫోను చేశాడు. వాళ్ళు ఎంతగా బాధ పడ్డారో... మళ్ళా ఫోను చేసి క్షమాపణలు చెప్పుకోవాలి! మనస్సంతా వ్యాకులపాటుతో మ్లానమయింది...

ఆరోజు వచ్చిన కవరును చించాడు అసహనంగా.

"మధుబాబూ,

సూర్యుడు, చంద్రుడు, దిక్పాలకులు... శాశ్వతమవ్వ వచ్చు గాని మనుష్యులు మాత్రం కాదు గదా... రెండు సంవత్సరాల క్రితం నాన్న పోయాడు... మొన్నటికి మొన్న అమ్మ

పోయింది. రేపు నీ శ్రేయోభిలాషులంతా ఒక్కొక్కరే కనుమరుగవ్వవచ్చు... కానీ అందరి ఆశీర్వాదాలు నీకు ఉండాలనే మనసా వాచా నేను కోరుకుంటున్నాను బాబూ! నువ్వు సుఖసంతోషాలతో ఈ భూమ్మీద స్వర్గసౌఖ్యాలు... కోయదొర చెప్పినట్లుగా మహారాజయోగం అనుభవించాలని కోరుకుంటున్నాను...

సర్వదా, సర్వథా నీ శ్రేయోభిలాషినే."

కళ్ళు చికిలించి ఆ ఉత్తరాన్ని పదేపదే చదవసాగాడు.

ఆలా చదువుతుండగా –

కళ్ళముందు ఓ మెరుపు మెరిసింది. ఆ మెరుపులోనుండి ఓ మానవాకారం జరజరా క్రిందకు జారి నేల మీద తన ముందు నిలబడింది.

– సన్నగా, పొడుగ్గా, రివటలా వున్న ఆమె తెల్లటి జుట్టును వేలుముడిలా వేసుకొని వున్నది... పొడుగు ముఖం... పెద్దపెద్ద కళ్ళు... నవ్వుతుండే పెదిమలు... ఆమెకూ తన అమ్మ వయస్సే వుండి వుంటుంది...

ఆమె పేరు... ఆమె పేరు... శంకర మణెమ్మ!

అవును... ఆమెది మంగళగిరే!

కొండ వాలులో చిన్న పూరింట్లో ఉంటూ తనకు తోచిన సేవ నలుగురికీ చేస్తున్నదట!

ఆమె తనింటికి అప్పుడప్పుడూ వస్తుండేది... ఆమె ఎందుకు వస్తుండేదో తెలియదు గాని... ఆమె రాక తన తల్లికి అంత యిష్టంగా వుండేది కాదని మాత్రం తనకు తెలుసు. ఆమె వచ్చిందంటే చాలు అమ్మ చికాకు పడుతుండేది. అదేమీ పట్టించుకోనట్లుగా ఆమె ఇంట్లో అన్ని మూలలా తిరుగుతుండేది.

ఆమె ఎప్పుడు వచ్చినా ఏవేవో పండ్లు– ఏ కాలంలోవి ఆ కాలంలో– తెస్తుండేది... అమ్మ 'ఎందుకు తెస్తావే అవన్నీ' అని అన్నా...'నేను కొంటానా పెడతానా... వాళ్ళూ, వీళ్ళూ ఇచ్చినవేగా' అంటూ నవ్వేస్తుండేది...

ఒకసారి తను అమ్మను– ఆమె వచ్చి వెళ్ళింతరువాత, "ఎవరే అమ్మా ఆమె?" అని అడిగాడు.

"చిన్నప్పుడు మేం ఇద్దరం కలసి హైస్కూల్లో చదువుకున్నాంలే... అదుగో ఆంధ్ర రాష్ట్రం వచ్చినప్పుడు హైకోర్టు గుంటూరులో పెట్టారుగా కొన్నాళ్లు... అప్పుడు వచ్చారు

వాళ్ళు మద్రాసునుంచి... తరువాత తరువాత దానికి చదువయితే రాలేదుగాని ఎవడితోటో ప్రేమలో పడి పిచ్చిపిచ్చి వేషాలు వేసింది... వెధవ మొహంది... ఇంట్లో చెప్పకుండా వాడితో లేచిపోయి... వాడు మోసం చేస్తే.... తిరిగి ఇంటికి రాలేక... అదుగో అప్పుడు ఎవరో చేరదీస్తే మంగళగిరిలో జేరి వాళ్ళకూ వీళ్ళకూ సాయబడుతూ బ్రతుకు వెళ్ళదీస్తోంది... మంచి కుటుంబాన్నించి వచ్చినా, జీవితాన్ని నాశనం చేసుకున్నది!" అన్నది తల్లి విసుగ్గా.

"మనింటికి డబ్బుకోసమా వచ్చేది ఆమె?" తను అడిగాడు.

"ఏంవో... వెధవ గోల!" మాట త్రుంచేస్తూ అక్కడనుంచి వెళ్ళిపోయింది తన తల్లి.

– ఆమె కేమిటి అవసరం ఇప్పుడు ఇంతగా ఉత్తరాలు వ్రాయటానికి?

మధుబాబు అత్తయ్య దగ్గరకు వెళ్ళాడు: "మంగళగిరిలోనే గదూ– అప్పుడప్పుడూ మనింటికి వస్తుండే శంకర మణెమ్మగారు వుండేది?" అడిగాడు.

మేనత్త వింతగా మధుబాబు ముఖంలోకి చూస్తూ అన్నది. "ఆ పిచ్చిదా?"

"ఆమెకు పిచ్చా?" తనూ విచిత్రంగా అత్తయ్య ముఖంలోకి చూచాడు– అందుకనేనేమో ఆమె తనకు అలాంటి ఉత్తరాలు వ్రాస్తున్నది.

"ఆఁ... ఎప్పుడో చిన్నప్పుడు మీ అమ్మతో కలసి చదువుకున్నదట... అదీ స్నేహం ఆమెతో మీ అమ్మకు!"

"ఆమెను ఒకసారి చూచి రావాలనిపిస్తున్నది... రేపుదయం వెళ్దామనుకుంటున్నాను!" అన్నాడు తలవంచుకొని మధుబాబు.

"ఆమెతో నీకేం పని మధూ!" అన్నది కళ్ళు విస్తృతం చేసుకొని అతడి ముఖంలోకి చూస్తూ ఆమె.

"అమ్మ స్నేహితురాలు గదా... అమ్మ పోయిన సంగతి తెలుసో తెలియదో... తెలిస్తే తప్పకుండా వచ్చి వుండేది... ఒక్కసారి వెళ్ళి వస్తే పోలేదు... తరువాత ఆమె ఎవరి ద్వారానో తెలుసుకొని బాధ పడే దానికంటే!" అన్నాడు– తనకు వస్తున్న ఉత్తరాల సంగతి చెప్పకుండా.

అవి తప్పకుండా మంగళగిరిలో వున్న ఆమె దగ్గరినుంచే వస్తుండాలి అనుకున్నాడు మరోసారి– మంగుళూర్ అనుకొని తను జారిపడ్డ విషయం గుర్తుకు రాగా!

ఆ విషయాన్ని అంతటితో నిలువరిస్తూ లేచి బయటకు వచ్చేశాడు మధుబాబు. అతడు వెళుతున్న వైపే చూస్తూ వుండిపోయింది మేనత్త.

చటుక్కున ముందుకు అడుగులు వేశాడు మధుబాబు ఆ ప్లాట్‌ఫాం మీద తనకు కావాల్సిన ఎర్ర బస్సు వస్తుండటంతో... అది విజయవాడ వెళుతూ మంగళగిరిలో ఆగే ఆర్డినరీ బస్సు!

అందులోకి ఎక్కేశాడు.

✣ ✣ ✣

దూరంగా కొండ మీద కనబడుతున్న తెల్లటి పానకాలస్వామి గుడి. క్రిందగా చాలా ఎత్తుగా వున్న నరసింహస్వామి గుడి గాలి గోపురం.

మంగళగిరి- మంగుళూర్ అనుకుంటే అతడు చిన్నప్పుడు ఎవరో అంటుండగా విన్న విషయం గుర్తుకు రాగా పెదవుల మీద చిరునవ్వు వెలసింది... రైల్వే వారు మంగుళూర్ స్టేషన్ అభివృద్ధికి డబ్బు మంజూరు చేస్తే అది మంగళగిరికి అనుకొని ఇక్కడ ఖర్చు చేశారట... అది నిజమో అబద్ధమో తెలియదుగాని... తను మాత్రం నిజంగా బోల్తాపడ్డాడు ఈ ఊళ్ళ విషయంలో!

బస్సు బయిల్దేరింది చిన్నగా. మనస్సు పరిపరివిధాల పోతోంది... ఆమెకు తన కుటుంబ విషయాలు తన తల్లి స్నేహితురాలిగా తెలిసివుండవచ్చు. కానీ తనకు అలాంటి ఉత్తరాలు రాయటంలో ఆమె ఏమి ఆశిస్తున్నదో తనకు అర్థం కావటంలేదు.

లేకపోతే ఆమెను గురించి గూడా తను అపోహ పడుతున్నాడా?... మంగుళూరు ఆంటీ విషయంలో తను అభాసు అయినట్లు!

బస్టాండులో దిగి కొండ దగ్గరకు రిక్షా మాట్లాడుకొని ఎక్కి కూర్చున్నాడు. మెయిన్ రోడ్డులోనుంచి కుడివైపు పల్లంలోకి దిగింది రిక్షా. బాలాంబ సత్రం దాటింది. ఎండిపోయిన కోనేరు దాటింది. గుడి వెనుక వీధిలోనుంచి ముందుకు వచ్చి, రథం పక్కగా వెళ్ళి శివాలయం ముందు ఆగింది. దిగి డబ్బులిచ్చి పంపేశాడు.

కాసేపు అటూయిటూ చూచి గుడి ముందునుంచి, మెట్లపక్క చిన్న గోడ దాటి కొండ క్రింద ఇళ్ళ వేపుకు ఎవరో వెళుతుంటే ఆపి అడిగాడు. "ఇక్కడ కొండ క్రిందగా శంకరమణెమ్మ గారని ఒకామె వుండాలి... ఆమె ఇల్లు మీకేమైనా తెలుసా?" అంటూ.

"రండి... నేనూ అక్కడికే వెళుతున్నాను!" అంటూ అతడు ముందు నడుస్తుండగా అతడిని అనుసరించాడు మధుబాబు ఉత్సాహంగా. ఇంత తేలిగ్గా ఆమె ఇల్లు దొరుకుతుందని తను అనుకోలేదు.

ఆమెను కలవబోతున్నాను అనుకుంటే తెలియని ఉద్విగ్నత అతడిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రెండు మూడు నెలలుగా తనను అయోమయంలో పడేస్తూ తన బుర్ర తింటున్న ఒక సమస్యకు సమాధానం దొరుకుతుందేమో అనే ఆశ అతడిని బాగా ఉత్సాహపరుస్తూ వడివడిగా అడుగులు వేయిస్తోంది.

'పెద్దామె... ఆమె మాటల్లో లాగానే తన శ్రేయోభిలాషి... పండ్లు ఏమైనా తీసుకువస్తే బాగుండేదేమో!' అనుకున్నాడు. ఆమె తనింటికి ఎప్పుడు వచ్చినా తెస్తుండేది అనే విషయం గుర్తుకురాగా కించిత్ చింతిల్లాడు గూడా. 'పోనీ వచ్చేటప్పుడు కొంత డబ్బు ఇచ్చివస్తే ఆమెకు దేనికైనా ఉపయోగపడవచ్చు!' అని తనకి తాను సర్ది చెప్పుకున్నాడు.

రాళ్లు... కాలిబాట... ఎత్తులు, పల్లాలు... అటూ యిటూ పిచ్చిమొక్కలు... ఏయింటికాయింటికి నేల చదును చేసి ఏర్పరుచుకున్న చిన్నచిన్న ఇళ్ళు...

అప్పుడు పది గంటలయింది. కొండవాలుగా నీడ పడుతునే వున్నది ఇంకా.

ముందు వెళుతున్న అగంతకుడి వెనుకనే జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు మధుబాబు. ఎత్తు మీదకు అడుగులు వేస్తుండటంతో భుజాన వ్రేలాడుతున్న గుడ్డసంచీ వీపు మీదకు జారిపోతున్నది.

"దగ్గరేనా?"

"అదే ఇల్లు... జనం ఉన్నారు చూడండి... అదే!"

"రోజూ వస్తుంటారా అంతమంది జనం?... ఏం చేస్తుంటారామె?"

అతడు ఆగి విచిత్రంగా మధుబాబు ముఖంలోకి చూచాడు: "రాత్రి ఆమె పోయారు గదా! మీకు తెలియదా?" అన్నాడు.

ఉలిక్కిపడ్డాడు మధుబాబు అతడి ఆ మాట వింటూనే: "పోయిందా!" అతడి నోటివెంట మరోమాట రాలేదు కొన్ని క్షణాలవరకు.

"మరి దేనికి వస్తున్నారు మీరు ఇక్కడకు? అది తెలిసికాదా?" ఆశ్చర్యపడటం అతడి వంతయింది.

మధుబాబు నీరసపడిపోయాడు. ఇదెక్కడి నిజం!

అమ్మ స్నేహితురాలు పోయిందనే విషయం అతడిని అమితంగా బాధించింది. అంతకు మించి తన సమస్యకు పరిష్కారం దొరుకుతుందేమోనని వచ్చిన అతడిని మరింత అయోమయంలో పడేసింది.

ఆ మనిషి ముందు నడుస్తుంటే, మధుబాబు ఏంచేయాలో తోచని వాడిలా అడుగులు వేస్తున్నాడు తడబడుతూ.

అక్కడ తనకు తెలిసినవాళ్లు ఇంకెవ్వరున్నారని వెళ్లాలి- ఆమె పోయింతరువాత!

ఆఖరుసారిగా ఆమె పార్థివ శరీరాన్ని చూచి వెనుదిరిగి వెళ్ళటమే తను చేయ గలిగినది- అత్తయ్య చెప్పినట్లు- అమ్మ వెళ్ళిపోయిన కొద్దిరోజులకే- అమ్మ స్నేహితు రాలయిన ఆ పిచ్చిది గూడా అమ్మను వెతుక్కుంటూ వెళ్ళిపోయింది!

నిజంగా ఆమే శ్రేయోభిలాషి అంటూ ఉత్తరాలు రాసి ఉంటే అందుకు కారణం ఇక తనకు తెలియనే తెలియదు.

ఆ యింటి సమీపానికి వచ్చారు ఇద్దరూ.

అక్కడంతా నిశ్శబ్దం... శ్మశాన నిశ్శబ్దం...

ముందుకు వెళ్ళి జనం మధ్యనుండి తొంగిచూచాడు... ఆమే!... అక్కడ శవమై వున్నది తన తల్లి స్నేహితురాలే!...

అంతగా ఆమెతో సాన్నిహిత్యం లేకపోయినా ఓ జీవి మరణం మరో జీవికి వేదనే. మనస్సంతా దిగులుతో నీరసించి పోయింది.

అక్కడ వందమంది దాకా జనం ఉన్నారు.

ఒక పక్కన ఆమె నిర్జీవ శరీరపు అంతిమ యాత్రకు ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నయి.

లావుపాటి ఒక వ్యక్తి ఆ పనులు చేస్తున్నవారికి ఏవేవో పనులు పురమాయిస్తున్నాడు. తాటాకుల పంచలో కూర్చొని వున్న ఆడవాళ్ళు నోట్లో చెంగులు కుక్కుకొని విలపిస్తున్నారు.

అక్కడ ఏర్పాట్లు చూస్తున్న ఆ లావుపాటి ఆయన దగ్గరకు మధుబాబు వెళ్ళాడు.

“ఎలా పోయారు ఆమె?”

"వారం రోజులుగా జ్వరం వస్తోంది... ఆయాసం... ఆమె ఈ ప్రపంచంలో అందరికీ సేవ చేయటానికే ముందు వుంటుంది గాని- తనకు మాత్రం ఎవరూ ఏ సేవా చేయగూడదు... అంత జ్వరంలోనూ ఆమె పనులు ఆమే చేసుకోవాలి... ఆమె త్రాగే జావగూడా ఆమే కాచుకోవాలి... మేము ఏనాడు చేసుకున్న పుణ్యమో ఆమె మా నడుమ వెలసింది... మా అందరికీ ఆమే తల్లి... మా ఇళ్ళల్లోని బాధలు ఆమె బాధలు ...మా ఆనందాలే ఆమె ఆనందాలు....మా దుఃఖమే ఆమె దుఃఖం..." ఆయన కళ్ళు తడుస్తున్నయి. ఆయన గొంతు బొంగురు పోతున్నది. "ఆమె ఎక్కడ జన్మించిందో తెలియదు... ఎక్కడ పెరిగిందో తెలియదు... ముప్పయి సంవత్సరాల క్రితం ఇక్కడ ప్రత్యక్షమయి, మా నడుమ, మాతో, మా మనిషిగా, మాలో ఒకరిగా తిరిగి ఈనాడు మమ్మలనందరినీ అనాథలుగా చేసి భగవత్ సాన్నిధ్యానికి వెళ్ళిపోయింది!"

ఆయన మాటలు మధుబాబుని కదిలించివేస్తున్నయి...

అత్తయ్యకు ఆమె పిచ్చిదిలాగానే కనబడవచ్చు కాని- ఇక్కడ వున్న వీళ్ళందరికీ ఆమె దేవత!

కొద్ది క్షణాల తరువాత ఆయన కోలుకొని, "ఇంతకీ చెప్పనేలేదు... మీరు ఎక్కడినుంచి వచ్చారు?... మా అమ్మ మీకెలా తెలుసు?... ఇంతకుముందు మిమ్మల్ని చూసిన గుర్తు రావటంలేదు నాకు!" అన్నాడు.

మధుబాబు క్షణం తటపటాయించాడు. "నేను గుంటూరు నుంచి వస్తున్నాను... శంకరమణెమ్మ గారు మా అమ్మకు స్నేహితురాలు... నా పేరు మధుబాబు... ఆమె పోయిన సంగతి గూడా నాకు ఇక్కడకు వచ్చేటంతటి వరకూ తెలియదు... ఆమెను చూచి వెళ్దామని వచ్చాను!"

ఆయన కళ్ళు రెపరెపలాడిస్తూ మధుబాబు వంక చూచాడు.

"మీరా బాబూ! ఈమధ్య మీకు కొన్ని ఉత్తరాలు రాసి నాచేత పోస్టు చేయించింది... నిన్న సాయింత్రమే ఇంకొకటి నాకు ఇచ్చి ఈ రోజు పంపమన్నది... తరువాత కొన్ని గంటలే ఆమె జీవించి వున్నది!"

గుండె దడదడలాడుతుండగా ఉక్కిరిబిక్కిరి అయ్యాడు మధుబాబు. 'అయితే ఆమే నన్నమాట తనకు ఇన్నాళ్ళూ శ్రేయోభిలాషినంటూ ఉత్తరాలు రాసింది! ఆమే నన్నమాట

తన భవిష్యత్తు అద్భుతంగా ఉండాలని ఆశిస్తూ తనను ఆశీర్వదించింది! ఆమే నన్నమాట తన యశస్సును కోరుకున్నది!' ఆవేశాన్ని ఆపుకోలేకపోయాడు... ఆ చివరి ఉత్తరంలో ఏం వ్రాసిందో?

"ఏదీ... ఎక్కడున్నదది?" అన్నాడు త్వరత్వరగా.

ఆయన ఆ పాకలోకి వెళ్ళి రెండు నిముషాలల్లోనే ఒక పెద్ద కవరు తీసుకు వచ్చి ఇచ్చాడు. ఆత్రంగా అందుకున్నాడు మధుబాబు.

అక్కడున్న జనమంతా అతడినే కళ్ళు పెద్దవి చేసుకు చూస్తున్నారు.

అతడు కవరు తెరిచి కళ్ళు చింపుకొని అందులోని అక్షరాల్లోకి దూసుకుపోతుండగా ఒక్కసారిగా క్రిందగా వున్న నరసింహస్వామి గుడి గాలిగోపురం మీదనుండి పావురాళ్ళు గుంపుగా ఎవరో తుపాకీ పేల్చినట్లుగా పెద్ద శబ్దంతో రెక్కలు టపటపలాడిస్తూ ఆకాశంలోకి లేచినయి!

❖ ❖ ❖

ఫెళఫెళమంటూ చితి ఎర్రటి మంటల్ని లేపుతూ మండిపోతోంది. వాటినుండి లేస్తున్న నిప్పురవ్వలు ఆకాశంలో నక్షత్రాల మధ్య చోటేమైనా దొరుకుతుందేమోనన్నట్లుగా పైపైకి ఎగిరిపోతున్నయి. నల్లటిపొగ శవం కాలుతున్న వాసనను వంటికి పులుముకొని అక్కడ అడవిలా పెరిగిన చెట్లను, పరిసరాలను ఆక్రమించుకుంటున్నది.

అంతమంది మనుష్యుల మధ్య పేర్చిన చితిమీద శంకరమణెమ్మ కాయం నిప్పులా మండిపోతున్నది.

పక్కగా తడిగుడ్డలతో నిల్చొని ఆ చితినీ, ఆ మంటల్నీ చూస్తూ, ఆ వేడిని అనుభవిస్తున్న మధుబాబు కళ్ళల్లో తడి ఆరిపోగా అవి జ్యోతుల్లా వెలిగిపోతున్నయి నెత్తుటి ముద్దల్లా-కాలుతున్న ఆ శరీరాన్నే పరికిస్తూ.

అతడి చేతిలో శంకరమణెమ్మ చివరిగా రాసిన ఉత్తరం ఉన్నది. అతడి తడి తలనుండి జారిపడుతున్న నీటి బొట్లు ఆ ఉత్తరాన్ని ఆప్యాయంగా స్పృశిస్తున్నాయి.

కాలిపోతున్న కనుగుడ్లను సేదదీరుస్తున్నట్లుగా రెప్పలు మూసుకు పోతున్నాయి.

'తన తల్లు లిద్దరూ ఆ విషయాన్ని తమ జీవితాంతం రహస్యంగానే ఉంచాలనుకుంటూ చేతిలో చేయి వేసుకొని వాగ్దానాలు చేసుకున్నప్పుడు... తనుమాత్రం దానిని లోకానికి

చాటి వాళ్ళ ఆత్మలకు క్షోభ నెందుకు చేకూర్చాలి?' ఎండిన పెదవులు అల్లల్లాడుతుండగా గొణుక్కున్నాడు.

రెండు చేతులూ ఎత్తాడు చితికి నమస్కరిస్తున్నట్లుగా.

కొద్దిగా ముందుకు వంగి తన చేతిలోని ఆమె వ్రాసిన ఆ ఉత్తరాన్ని చితి మధ్యలో– మరెవ్వరికీ ఆ విషయం తెలిసే అవకాశం లేకుండా– ఆమెలోనే కలిసిపోయి ఆమె లాగానే కాలి బూడిదయ్యేలా ఆ అగ్నిజ్వాలలకు అర్పించి వేశాడు మధుబాబు!

*(ఆంధ్రభూమి: సచిత్ర మాసపత్రిక: జనవరి, 2005)*